ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు వినతి



వినతి పత్రం అందచేస్తున్న లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలయ్యేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకార వేతనాలు, ట్యూషన్ ఫీజు నిధులను విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. కోర్సులు పూర్తి చేసినా ఫీజులు చెల్లించనందున కాలేజీ యజమానులు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్, నాయకులు రవీందర్, నరేష్, ప్రియ, సునీత, దివ్య, జ్యోతి, మమత, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ర్యాలీ



లాలాపేట: తార్నాకలోని చింతల్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను పురస్కరించుకుని హ్యాండ్ వాష్‌పై వాటర్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేతులను శుభ్ర పరచుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆరోగ్య పరిరక్షణపై అందరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరచుగా చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా సగం రోగాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాటర్ ఎయిడ్ సొసైటీ ప్రతినిధి జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, బస్తీ వాసులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకలకు ఆహ్వానం



లాలాపేట: చార్మినార్‌లోని భాగ్యలక్ష్మీ దేవాలయంలో నిర్వహించతలపెట్టిన దీపావళి వేడుకలకు రావాలని కోరుతూ గురువారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డిని భాగ్యలక్ష్మీ మందిర్ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శశికళ, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

29 జీవోను రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: జీవో నంబర్ 29 రద్దు చేసి గ్రూప్–1 పరీక్షలను వాయిదా వేయాలని సౌతిండియా జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. జీవో నంబర్ 29 వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందన్నారు.

ఓయూ పీఎస్‌లో ఉద్రిక్తత

- విచారణ పేరుతో పిలిచి అకారణంగా యువకులను చితకబాదిన పోలీసులు
- పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్‌పై దాడి జరిగిందంటూ సోషల్ మీడియా వార్తలతో కలకలం
- ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండానే పీఎస్ నుంచి యువకులను పంపించిన వైనం



ఓయూ పీఎస్ ఎదుట మాట్లాడుతున్న స్పోర్ట్స్ స్క్వేర్ నిర్వాహకులు. గాయాలు చూపుతున్న సందీప్‌రెడ్డి



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో గురువారం దినమంతా గందరగోళం నెలకొంది. తార్నాకలోని స్పోర్ట్స్ స్క్వేర్ నిర్వాహకులను ఓయూ పోలీసులు విచారణకు పిలవడం, భూకబ్జా కేసులో ఓ సినీనిర్మాతను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. ఓయూ ఇన్‌స్పెక్టర్‌పై పోలీసుస్టేషన్‌లో అడిషనల్ డీసీపీ, ఏసీపీ సమక్షంలో దాడి జరిగిందంటూ సోషల్ మీడియాలో కలకలం రేగింది. పూర్తి వివరాలిలా ఉన్నాయి... తార్నాక హనుమాన్ నగర్‌లోని స్పోర్ట్స్ స్క్వేర్‌లో ఇటీవలి దసరా పండుగ సందర్భంగా గేమింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, వాటిని కట్టడి చేయాలని తార్నాకకు చెందిన ఓ నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో స్పోర్ట్స్ స్క్వేర్ నిర్వాహకులు సంతోష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శివరామిరెడ్డిలను పోలీసులు పీఎస్‌కు తీసుకొచ్చారు. సమాజంలో పరపతి గల తమను అకారణంగా ఎందుకు పిలిపించారని సందీప్‌రెడ్డి బ్రదర్స్ ప్రశ్నించడంతో కోపోద్రిక్తుడైన ఇన్‌స్పెక్టర్ వారిని ఈడ్చుకెళ్లి తీవ్రంగా చితకబాదారు. విషయం తెలుసుకున్న ఉప్పల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి ఓయూ పీఎస్‌లో ఏసీపీ, ఇతర ఉన్నతాధికారులతో దాదాపు 2 గంటలపాటు చర్చలు జరిపి ఇరువురి మధ్య రాజీ కుదిర్చారు.

దుర్భాషలాడిన ఇన్‌స్పెక్టర్: బాధితులు

విచారణ పేరుతో తమను ఓయూ పీఎస్‌కు పిలిచిన పోలీసులు, ఇన్‌స్పెక్టర్ దుర్భాషలాడారని సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శివరామిరెడ్డి పీఎస్ ఎదుట విలేకరులతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం ఎలాంటి నేరం చేయకున్నా బందిపోటు దొంగల మాదిరిగా దాదాపు 15 మంది పోలీసులు తీవ్రంగా కొట్టారు. మెడ, చెవి, పెదవిపై గాయాలయ్యాయి. పైగా మేమే ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేశామంటూ చిత్రీకరించారు' అని సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. తాము దాడి చేస్తే కేసు పెట్టాలి కానీ అలాంటిదేమీ లేకుండానే పీఎస్ నుంచి పంపిచారని తెలిపారు. అకారణంగా కొట్టి గాయపర్చిన పోలీసులపై స్పోర్ట్స్ స్క్వేర్ నిర్వాహకులు అదే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులపై సీఎంకు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా, భూ కబ్జా కేసులో ఓ సినీ నిర్మాతను పీఎస్‌కు పిలిచి విచారించగా పోలీసులను అడుగగా ఆ కేసు రెండు రోజులపాటు విచారణ సాగుతుందంటూ సమాధానం దాటవేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా
- వినియోగదారులకు మెరుగైన సేవలు
- సికింద్రాబాద్ విద్యుత్ నూతన డీఈ సీహెచ్ బ్రహ్మానందంతో 'సాక్షి'ముఖాముఖి



బన్సీలాల్‌పేట్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ ప్యారడైజ్ సర్కిల్(ఆపరేషన్) నూతన డివిజనల్ ఇంజనీర్(డీఈ) సీహెచ్ బ్రహ్మానందం చెప్పారు. వికారాబాద్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన సికింద్రాబాద్ విద్యుత్ డీఈగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన డీఈ శ్రీధర్ చార్మినార్‌కు బదిలీ అయ్యారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజవర్గాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు డీఈ బ్రహ్మానందం పేర్కొన్నారు. ముఖాముఖిలోని ముఖ్యాంశాలు ఈవిధంగా ఉన్నాయి.

ప్రశ్న: సికింద్రాబాద్ ప్యారడైజ్(ఆపరేషన్) డివిజన్ కార్యకలాపాల గురించి వివరించండి

డీఈ: డివిజన్ పరిధిలో జేమ్స్‌స్ట్రీట్, పద్మారావునగర్, సీతాఫల్‌మండి మూడు సబ్ డివిజన్లు, పద్మారావునగర్, ప్యారడైజ్, సీతాఫల్ మండి, తార్నాక, లాలాగూడ, పార్సీగుట్ట, జనరల్‌బజార్, క్లాక్‌టవర్, బైబిల్ హౌస్ వంటి 9 సెక్షన్ కార్యాలయాల ద్వారా విద్యుత్ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాం. ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటలపాటు సరఫరా చేస్తున్నాం. ఎక్కడ ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా సిబ్బంది అక్కడికి చేరుకొని పరిష్కరిస్తున్నారు.

ప్రశ్న: విద్యుత్ కనెక్షన్లు..రెవెన్యూ రాబడి గురించి...

డీఈ: సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆపరేషన్ పరిధిలో సుమారు లక్షా 71 వేల 500 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతినెలా బిల్లుల రూపంలో రాబడి సుమారు రూ.17.4 కోట్లు ఉంది. సిబ్బంది క్షేత్ర స్థాయిలో బిల్లుల వసూళ్లతో పాటు సరఫరా విషయంలో కూడా ఎంతో జాగ్రత్తగా పనిచేసే విధంగా వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. సకాలంలో బిల్లులు చెల్లించని వారి కనెక్షన్లను తొలగిస్తున్నాం.

ప్రశ్న: విద్యుత్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు వివరించండి...

డీఈ: విద్యుత్ సమస్యల పరిష్కారానికి సకాలంలో తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ప్రజలకు ప్రతి రోజు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో దరఖాస్తు చేసుకున్నవారికి నూతన కనెక్షన్ల ఇస్తున్నాం. సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రోజు సాయంత్రం తమ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నాం.

ప్రశ్న: సెంట్రల్ బ్రేక్ డౌన్ సర్వీసు(సీబీడీ) తీరుతెన్నులు...

డీఈ: విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా రాత్రి, పగలు అనే తేడా లేకుండా సీబీడీ సిబ్బంది పని చేస్తున్నారు. ఎక్కడైనా కరెంట్ సరఫరా నిలిచిపోయినా, అంతరాయం ఏర్పడినా వెంటనే సీబీడీ సిబ్బందికి ఫోన్ కాల్ ద్వారా సమాచారం ఇస్తే అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తారు. ఓ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఈ) స్థాయి అధికారి పర్యవేక్షణలో తమ ఏఈలు షిఫ్టులవారీగా విధులు నిర్వర్తిసారు. ఫోన్ సమాచారం వచ్చిన వెంటనే సిబ్బంది అప్రమత్తమవుతారు.

ప్రశ్న: సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం... అదే విధంగా సమస్యలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలపై తీసుకుంటున్న చర్యలు...

డీఈ: తమ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోం. నిర్దిష్టంగా ప్రజలు ఫిర్యాదులు చేస్తే క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బందిపై వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకుంటున్నాం. సేవల కోసం ఎవరైనా సిబ్బంది లంచం అడిగితే వెంటనే ప్రజలు 040–23454884, 7680901912కు కాల్ చేయాలని డీఈ సూచించారు.

ప్రశ్న: గృహజ్యోతి పథకం కింద బిల్లుల మినహాయింపు గురించి...

డీఈ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు విద్యుత్ బిల్లుల విషయంలో కొంత మినహాయింపు ఇస్తోంది. గృహజ్యోతి పథకం కింద ప్రతి నెలా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న ప్రజలు ఎలాంటి బిల్లులు చెల్లించరాదు. దీనికి సంబంధించి జీహెచ్ఎంసీ ద్వారా ఆధార్, ఇతరత్రా వివరాలతో దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఈ పథకం కింద బిల్లు మినహాయింపు పొందడానికి వీలవుతుంది. అన్ని రకాల పత్రాలతో దరఖాస్తు చేసుకున్న పేదలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం విషయంలో ఎలాంటి సమస్యలు ఇబ్బందులు ఉన్నా వెంటనే మమ్మల్ని సంప్రదించాలి.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మోండా మార్కెట్ రోడ్డులో ఉద్రిక్తత



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ రోడ్డులోని ఫుట్‌పాత్ ఆక్రమణలను గురువారం సాయంత్రం పోలీసులు తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. హాకర్స్, పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. ఏళ్ల తరబడి ఫుట్‌పాత్ వ్యాపార కార్యకలాపాలు నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమను ఉన్నపళంగా తొలగిస్తే ఎలా అంటూ చిరు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాకు సమయం కూడా ఇవ్వకుండా ఇలా తొలగించడం ఏమిటి' అని ప్రశ్నించారు. దీంతో పోలీసులు వారికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ శంకర్ రాజు, ఇన్‌స్పెక్టర్ ఉమాశంకర్‌తోపాటు ఉత్తర మండలం పరిధిలోని పలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు. సికింద్రాబాద్ బాటా చౌరస్తా ముందు నుంచి ఓల్డ్ జైల్, మోండా మార్కెట్ రోడ్డు, కమల్ స్టోర్, గాంధీ ఆసుపత్రి చౌరస్తా, పాలికా బజార్ గుండా ఆల్ఫా హోటల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్‌లపై వేసిన షెడ్డులను, దుకాణదారుల ఆక్రమణలను కూడా అధికారులు తొలగించారు. సుమారు 150 ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఇక్కడ ఫుట్‌పాత్‌లు ఉన్నా ప్రజలు మాత్రం రోడ్డుపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఫుట్‌పాత్‌లను అనేక మంది తమ వ్యాపార కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారు. ఆక్రమణల తొలగింపుతో ఫుట్‌పాత్‌లు ఖాళీగా దర్శనమిచ్చాయి.

టీసీల సమర్పణకు నెల రోజుల గడువు ఇవ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ కోర్సుల్లో సీటు సాధించిన విద్యార్థులకు ఒరిజినల్ టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) సమర్పణకు నెల రోజుల గడువు ఇవ్వాలని ఏబీవీపీవర్సిటీల స్టేట్ కన్వీనర్ జీవన్ డిమాండ్ చేశారు. ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీ బంద్ వల్ల టీసీల జారీలో జాప్యం ఏర్పడుతోందన్నారు. మూడేళ్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కానందున కాలేజీల యజమానులు టీసీలు ఇవ్వడం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు కాలేజీ ఫీజులు చెల్లించి సకాలంలో టీసీలు సమర్పించే అవకాశం లేదన్నారు. కౌన్సెలింగ్ సమయంలో టీసీలు లేకుంటే పీజీ అడ్మిషన్లు రద్దు చేయవద్దని కోరారు.

డిపాజిట్లు లేకుండా మెస్ సదుపాయం కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డిపాజిట్లు లేకుండా భోజన సదుపాయం కల్పించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు అలివేలి రాజు మాట్లాడుతూ డిపాజిట్ల పేరుతో లక్షల రూపాయలను వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కానందున హాస్టల్ ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

వాల్మీకి జీవితం యువతకు ఆదర్శం



వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ



మహర్షి వాల్మీకికి నివాళులు అర్పిస్తున్న పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి తదితరులు

రసూల్‌పురా: మహర్షి వాల్మీకి జీవితం యువతకు ఆదర్శమని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డు వాల్మీకి నగర్‌లోని వాల్మీకి ఆలయంలో సమాజ్ నాయకులు సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఆదికవిగా సుప్రసిద్ధుడని, ఆయన జీవితం నైతిక, ఆధ్యాత్మిక విలువలు నేర్పే జీవిత పాఠంగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. వాల్మీకి మహర్షి బోధనలు ధర్మబద్ధంగా ఉండేందుకు, జాలి, కరుణతో కూడిన జీవితం గడిపేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, రణవీర్, సుశీల్, లడ్డు, వినోద్, ప్రదీప్, అమర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

టీజీపీసీబీలో వాల్మీకి జయంతి వేడుకలు

సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రామా, కర్మ, భక్తి, అహింస, ఆధ్యాత్మికతను పెంపొందింపజేయడంలో వాల్మీకి రచనలు కీలకంగా నిలుస్తాయన్నారు. ఆయన నిర్దేశించిన మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సోషల్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు



విలేకరుల సమావేశంలో ఎస్సార్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు

సనత్‌నగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయిని పండిస్తూ నగరానికి తరలిస్తున్న ఇద్దరు యువకులను ఎస్సార్‌నగర పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 6.3 కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బల్కంపేట సమీపంలోని నేచర్ క్యూర్ రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి వ్యాపారం జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బంది ఆకస్మిక దాడి చేశారు. పాడేరు జిల్లా ముంచింగిపట్టు మండలం సిర్లిమెట్ల గ్రామానికి చెందిన కిల్లో మాధవరావు (20), పశ్చిమ గోదావరి జిల్లా నల్లజార్లకు చెందిన మల్లుల రాకేష్ (21) ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద 6.3 కిలోల గంజాయి దొరికింది. నిందితులిద్దరూ గతంలో అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో పనిచేసేవారు. ఇటీవల కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనానికి ఈఎంఐలు కట్టలేక ఇబ్బంది పడేవాడు.మిత్రులైన అలెక్స్, రాకేష్‌ల సూచన మేరకు మాధవరావు స్వగ్రామానికి వెళ్లి తన సోదరుడు కేశవరావు పండిస్తున్న గంజాయిని రైలులో నగరానికి తీసుకువచ్చారు. గంజాయిని రాకేష్‌తో కలిసి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో పరారీలో ఉన్న అలెక్స్, గంజాయి పండిస్తున్న కేశవరావుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పట్టుబడిన నిందితులు మాధవరావు, రాకేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

క్రైస్తవుల ఆల్‌సోల్స్ డేకు ఏర్పాట్లు: తలసాని



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన క్రైస్తవ ప్రతినిధులు

పద్మారావునగర్: క్రైస్తవులు ఎంతో పవిత్రంగా జరుపుకునే ఆల్ సోల్స్ డే (పవిత్ర ఆత్మల దినం) కోసం అన్ని ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. నవంబర్ 2న క్రైస్తవులు శ్మశాన వాటికల్లో ఆల్ సోల్స్ డే కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ క్యాథలిక్ గ్రేవ్ యార్డ్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆల్ సోల్స్ డే ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశానవాటికలో శుభ్రత, లైటింగ్ ఏర్పాటు, చెత్తాచెదారం వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించనున్నట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది క్రైస్తవులు శ్మశానవాటికకు తరలి వచ్చి సమాధులకు ప్రత్యేక పూజలు చేస్తారని ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కె.హేమలత, ఫాదర్ ఆరోగ్యం, హాజీటార్చర్ జయరాజ్, డిసిల్వా, సదాయ్‌రాజ్‌లతోపాటు బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, రాజు, వెంకట్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రేటర్' విభజన మంచిదే: కోట నీలిమ



సనత్‌నగర్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను నాలుగు భాగాలుగా విభజించే ప్రతిపాదనను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ స్వాగతించారు. అయితే రెవెన్యూపరమైన అంశాలపై లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలో జనాభా గణనీయంగా పెరగడంతో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు పాలనా వ్యవస్థలపై ఒత్తిడి పెరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జీహెచ్ఎంసీని నాలుగు భాగాలుగా విభజించే ప్రతిపాదనను ప్రస్తావించినట్లు గుర్తుచేశారు. వేర్వేరు మున్సిపాలిటీలుగా చేయడం వల్ల ఆ మున్సిపాలిటీల్లో ప్రత్యేక అవసరాలను తెలుసుకుని మెరుగుపరచుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అధికార వికేంద్రీకరణ జరిగితే మారుమూల ప్రాంతాలకు సైతం అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. కొత్తగా ఏర్పడే సంస్థల ఆదాయ వనరులకు సంబంధించి ఖచ్చితమైన ప్రణాళిక అవసరమని చెప్పారు. వికేంద్రీకరణ విధానం నగరవాసుల జీవన పరిస్థితులను మెరుగుపరచగలదన్నారు.

వైద్యసాయానికి సిద్ధంగా ఉన్నాం

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: నిరుపేదలకు వైద్య సాయాన్ని అందించేందుకు నిరంతరం సిద్ధంగా ఉంటామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ హామీ ఇచ్చారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన స్టాలిన్, వారాసిగూడకు చెందిన బీ పాషా అనారోగ్యం బారిన పడి వైద్య సహాయం కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించారు. పద్మారావు గౌడ్ చొరవ తీసుకొని వారికి వైద్య ఖర్చుల నిమిత్తం చెరో రూ.2 లక్షల చొప్పున సీఎం సహాయనిధి నుంచి ఎల్‌ఓసీ పత్రాలను తెప్పించి గురువారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య, సంక్షేమ పథకాలు అందించడం కోసం తమ కార్యాలయం మొదటి నుంచి బాసటగా నిలుస్తుందని తెలిపారు. పదేళ్ల కాలంలో రికార్డు సంఖ్యలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పేదలకు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీల ప్రభాకర్, జహంగీర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

పద్మారావునగర్: సికింద్రాబాద్ కవాడిగూడ ప్రధాన రహదారిలోని పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్–1 కార్యాలయంలో గురువారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ సైబర్ సెక్యూరిటీ, విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్–1 చీఫ్ జనరల్ మేనేజర్ అఖిలేష్ పాఠక్, సీజీఎం ఎస్ఎంవీ నానాజీ(ఏఎం), సీజీఎం వెంకట ఎస్వీ(ఎఫ్అండ్ఏ), సీనియర్ జీఎం పీసీఎస్ రెడ్డి(విజిలెన్స్)లతోపాటు పెద్ద ఎత్తున ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఎస్.ఐ.లు పకీజా, భవానీ, శ్రీకాంత్, సైబర్ క్రైమ్ టెక్నికల్ అనలిస్ట్ శ్రీకాంత్ మాట్లాడుతూ చాలామంది అవగాహనారాహిత్యం, తొందరపాటు, అమాయకత్వంతో సైబర్ నేరస్తులకు చిక్కిపోతూ తమ డబ్బులను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. డిజిటల్ ఆర్థిక లావాదేవీల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్‌పరంగా మోసగాళ్ల భారీ నుంచి ఎలా రక్షించుకోవాలనే విషయాలపై పోలీసులు అవగాహన కల్పించారు.



పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

ప్రతిభ చాటే క్రీడాకారులకు ప్రోత్సాహం

పవర్ లిఫ్టర్ మహేశ్ వైష్ణవిని అభినందించిన ఎమ్మెల్యే తలసాని



మహేష్‌వైష్ణవిని అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్..

సనత్‌నగర్: ప్రతిభను చాటే క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఇంటర్నేషనల్ కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన మహేష్ వైష్ణవి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ వైష్ణవిని ఆయన అభినందించారు. ఈ నెల 4 నుంచి 13 వరకు సౌతాఫ్రికాలోని సన్‌సిటీలో జరిగిన పోటీల్లో సుమారు 30 దేశాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆమె వివరించారు. 84 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్‌తోపాటు స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ద చాంపియన్‌షిప్ మెడల్ కూడా లభించిందని చెప్పారు. తనకు మొదటి నుంచి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, యువ నాయకులు తలసాని సాయికిరణ్‌యాదవ్ అన్ని విధాలుగా అండగా ఉంటూ ప్రోత్సాహించడం వల్లనే తాను ఈ మెడల్స్‌ను సాధించగలిగానని తెలిపారు. ఇంటర్నేషనల్ కామన్వెల్త్ లిఫ్టింగ్ పోటీలకు హాజరయ్యేందుకు తాను ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న సాయికిరణ్ యాదవ్ తలసాని ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు ఆమె గుర్తుచేశారు. తనపై నమ్మకంతో కామన్వెల్త్ పోటీలకు హాజరుకావడానికి ఆర్థిక సహకారం అందించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: తలసాని



కుట్టుమిషన్లు, ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: మోండా మార్కెట్ ఓల్డ్ జైలు వద్ద బాధితులైన దర్జీలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. గురువారం ఓల్డ్‌జైలు వద్ద బాధితులకు మేరు సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు వద్ద ఏళ్ల తరబడి దర్జీ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న బాధితుల దుకాణాల ప్రహరీలు కూలి ధ్వంసమయ్యాయన్నారు. దీంతో పలు కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాను ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినా ఇంతవరకు ఎలాంటి సహాయం ప్రభుత్వం నుంచి అందలేదని విచారం వ్యక్తం చేశారు. షాపులు కూలిపోయి ఉపాధి కోల్పోయిన బాధితులు అదే స్థలంలో వ్యాపారాలు చేసుకునే విధంగా తాత్కాలిక షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, నాగులు, మహేష్ యాదవ్, తలసాని స్కైలాబ్ యాదవ్, మేరు సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి నరేష్, రాజ్‌కుమార్, ఓదెల సత్యనారాయణ, రాజ్‌గోపాల్, సంగేవార్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.